# సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం ■ 26 ■ సెప్టెంబర్ ■ 2023






**10 మంది మహిళలకు గాయాలు**

పోచంపల్లి మండలం కొత్తగూడెం సమీపంలో ఆటో బోల్తా పడి 10 మంది మహిళలకు గాయాలయ్యాయి. - 8లో



**సురక్ష సిబ్బందిపై భక్తుల దాడి**

యాదాద్రికి వచ్చిన భక్తులు కొందరు కొండపైన విధులు నిర్వహిస్తున్న సురక్ష సిబ్బందిపై సోమవారం దాడి చేశారు. - 8లో



**ప్రతిభను వెలికితీసేందుకే..**

ప్రతిభను వెలికితీసేందుకే స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మన్ జడల అమరేందర్ అన్నారు. - 9లో

## న్యూస్‌రీల్

### యాదాద్రిలో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న ఆచార్యుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. ఏకాదశి కావడంతో ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు వివిధ పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు చేపట్టారు. ఈ పూజల్లో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగాయి. కొండపైనే అనుబంధ ఆలయమైన శ్రీపర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వా అర్చన పూజలు నిర్వహించారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలను విశేషంగా చేపట్టారు. భక్తులకు పూజారులు శ్రీస్వామి వారి ఆశీస్సులను అందజేశారు.

### కల్తీ పదార్థాలు విక్రయిస్తే చర్యలు

భువనగిరి రూరల్: జిల్లాలోని హోటళ్లలో కల్తీ పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సెక్యూరిటీ అధికారి స్వాతి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ హోటల్‌లో సోమవారం ఆమె తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటళ్లలో నాణ్యమైన ఆహార పదార్థాలను తయారు చేసి అమ్మాలన్నారు.

### రేపు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

భువనగిరి టౌన్: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 27న ఉదయం 10:30 గంటలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కుల సంఘాల నాయకులు, అధికారులు, అనధికారులు, ప్రజలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### 'భగీరథ' కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

భువనగిరి టౌన్: తమకు ఉద్యోగభద్రత కల్పించడంతోపాటు తమ న్యాయమైన డి మాండ్లు నెరవేర్చాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికులు భువనగిరి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలో భాగంగా సోమవారం నాలుగో రోజు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని మౌనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరుమల శ్రీను మాట్లాడుతూ కార్మికులకు నెలకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే త్వరలో సమ్మె చేపడతామన్నారు. విధుల్లో భాగంగా పాము కాటుకు గురైన అనాజిపురానికి చెందిన కార్మి కుడు స్వామిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. దీక్షలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ మల్లేశం, ప్రసాద్, రమేష్, కృష్ణ, సంపత్, మహేష్, యాదగిరి, కర్ణాకర్, అశోక్, భాస్కర్, మహేందర్, జంగయ్య, సురేష్ పాల్గొన్నారు.

# డెడ్‌లైన్.. 5వ తేదీ!

- ఆలోగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు మౌఖిక ఆదేశాలు
- అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు
- ఈనెల 29న నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో హరీశ్‌రావు..
- వచ్చే నెల 2న సూర్యాపేట, నల్లగొండలో కేటీఆర్ పర్యటన
- వారితోపాటు పాల్గొననున్న జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండలో ప్రారంభానికి సిద్ధమైన ఐటీ హబ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : 'అక్టోబరు 5వ తేదీ తరువాత ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ రావచ్చు.. ఈలోగా పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, కొత్త వాటికి శంకుస్థాపనలను పూర్తి చేయండి.. సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయండి.' అని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు రావడంతో ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. నిధుల మంజూరు, పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సిద్ధమయ్యారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే సూర్యాపేట, నల్లగొండలో వచ్చే నెల 2వ తేదీన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన ఖరారు కాగా, మిర్యాలగూడలోనూ అదే రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు కేటీఆర్ హాజరయ్యే అవకాశం ఉంది. ఇందులో భాగంగా నల్లగొండలో మిగిలిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.87 కోట్లు మంజూరు చేసింది. ఈనెల 29వ తేదీన మంత్రి హరీశ్‌రావు నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే యాదాద్రి జిల్లా రామన్నపేట, నకిరేకల్, తుంగతుర్తిలో పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. వారితోపాటు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**నేడో, రేపో మిర్యాలగూడ పర్యటన ఖరారు**

సూర్యాపేటలో ఐటీ హబ్ పనులకు మంత్రి కేటీఆర్ అక్టోబరు 2వ తేదీన ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే ఖరారైంది. మరోవైపు నల్లగొండలోనూ వివిధ అభివృద్ధి పనులకు అదే రోజు సాయంత్రం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు కేటీఆర్ ఓకే చెప్పారు. ఇందులో భాగంగా మర్రిగూడ బైపాస్‌లో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రూ.116 కోట్లతో రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు పూర్తి కావడంతో వాటిని ప్రారంభించనున్నారు. వాటితోపాటు ఐటీ హబ్‌ను, బీట్‌మార్కెట్‌లో నిర్మించిన సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించనున్నారు. నీలగిరి కళాభారతి భవనం, ఉదయ సముద్రం బండ్, అక్కడే తీగల వంతెన, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, అమృత్–2 కింద తాగునీటి పథకం, ఆర్ అండ్‌బీ కార్యాలయాలు, అతిథి గృహం భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలను వివరించేందుకు నిర్వహించనున్న ప్రగతి నివేదన సభలో ప్రసంగించనున్నారు. మరోవైపు మిర్యాలగూడలోనూ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సోమవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో అదే రోజు మధ్యాహ్నం మిర్యాలగూడలోనూ మంత్రి కేటీఆర్ పాల్గొననున్నారు. అయితే అధికారికంగా దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉంది.

**నకిరేకల్, తుంగతుర్తిలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు**

29వ తేదీన మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు యాదాద్రి జిల్లా (నకిరేకల్ నియోజకవర్గం) రామన్నపేటలో ఎస్‌టీఓ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. రూ.5.50 కోట్లతో నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రి భవనం, రూ.2.5 కోట్లతో నిర్మించే చెన్నకేశవస్వామి ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. కట్టంగూర్ మండలం చెరువు అన్నారంలో రూ.101.62 కోట్లతో నిర్మించనున్న అయిటిపాముల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆ తరువాత నకిరేకల్‌లో లైబ్రరీ, ఎస్‌టీఓ కార్యాలయ భవనాలను ప్రారంభించనున్నారు. అలాగే రూ.5.70 కోట్లతో నిర్మించనున్న డిగ్రీ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

**ఎమ్మెల్యేల ఉరుకులు పరుగులు**

ప్రభుత్వం నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. నిధులను మంజూరు చేయించుకోవడంతోపాటు అభివృద్ధి పనులను వేగవంతం చేసే పనులపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం నల్లగొండ, సూర్యాపేట, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో మంత్రుల పర్యటనను ఖరారు చేయించుకున్నారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు ఆ దిశగా కసరత్తు వేగవంతం చేశారు. నల్లగొండ అభివృద్ధి పనుల కోసం రూ.87 కోట్లను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంజూరు చేయించుకున్నారు. వాటితో వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీ, పార్కులు, తాగునీటి సరఫరా, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం పనులకు శంకుస్థాపనలు చేయించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే గృహలక్ష్మి, బీసీబంధు, దళితబంధు వంటి పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, ఎంపికైన వారికి యూనిట్ల మంజూరు వంటి పనులపై దృష్టి పెట్టారు. సోమవారం తుంగతుర్తిలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. మరోవైపు ఇతర నియోజకవర్గాల్లోనూ రేషన్ కార్డుల మంజూరు, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశారు.

## మున్సిపల్ కమిషనర్‌తో రేపు ఫోన్‌ఇన్

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 35 వార్డుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యపై బుధవారం 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రెయినేజీ, దోమల బెడద తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

**తేదీ : 27-09-2023**

**ఉదయం 10 నుంచి 11 గంటల వరకు**

**డయల్ చేయాల్సిన నంబర్ : 78931 77699**



భట్టు నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

# 'కుంభం' యూటర్న్



హైదరాబాద్‌లో తన ఇంటికి వచ్చిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కుంభం



అనిల్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో వలిగొండలో పార్టీ కార్యకర్తల సంబరాలు

- రెండు నెలల వ్యవధిలోనే సొంతగూటికి అనిల్‌కుమార్‌రెడ్డి
- ఇంటికి వెళ్లి ఆహ్వానించిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- భువనగిరి అసెంబ్లీ టికెట్ హామీతో కాంగ్రెస్ పార్టీలో చేరిక
- బీఆర్‌ఎస్‌తో ముగిసిన జర్నీ

సాక్షి, యాదాద్రి : డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీని వీడి సొంత గూటికి చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని కుంభం ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కుంభం కాంగ్రెస్ పార్టీ నుంచి భువనగిరి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. అయితే బీఆర్‌ఎస్‌లో చేరిన కుంభం తిరిగి కాంగ్రెస్‌లోకి వస్తారని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, పీసీసీ పెద్దలు పలువురి నుంచి పార్టీలో చేరాలని ఆహ్వానం వచ్చింది.

**జూలై 24న బీఆర్‌ఎస్‌లోకి..**

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో విభేదాల కారణంగా గత జూలై 24న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కుంభం బీఆర్‌ఎస్‌లో చేరికతో కాంగ్రెస్ పార్టీ భువనగిరిలో ఒక కుదుపునకు లోనయ్యింది. ఏఐసీసీ నేత ప్రియాంకగాంధీ, పీసీసీ చేపట్టిన సర్వేల్లో పలువురు ఆశావహుల కంటే కుంభంకు విశేష స్పందన రావడంతో ఆయనను తిరిగి రప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రయత్నాలు చేపట్టి సఫలమయ్యారు.

**బీఆర్‌ఎస్‌కు తప్పని గట్టి పోటీ**

కాంగ్రెస్ నుంచి పోటీదారుగా భావిస్తున్న కుంభం ఆ పార్టీని వీడి తమ పార్టీలో చేరడంతో బీఆర్‌ఎస్ రిలాక్స్ అయ్యింది. సిట్టింగ్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సైతం తనకు పోటీగా బలమైన అభ్యర్థి లేకుండా పోయారని భావించారు. తిరిగి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సొంత గూటికి చేరడంతో పైళ్లకు గట్టిపోటీ తప్పని పరిస్థితి నెలకొంది.

**టికెట్ల ప్రకటన రోజునుంచే..**

సీఎం కేసీఆర్ సిట్టింగ్‌లకే సీట్లు ప్రకటించిన రోజునుంచే కుంభం మౌనం దాల్చారు. అయితే సూర్యాపేట సభకు సీఎం కేసీఆర్ కుంభంను తన చాపర్‌లో వెంట బెట్టుకుని పోయారు. ఆ రోజునే భువనగిరి టికెట్ తనకు ఇవ్వాలని సీఎంను కోరినట్లు సమాచారం. అయితే కేసీఆర్ ప్రకటించిన సిట్టింగ్ సీట్లలో భువనగిరి కూడా ఉండడంతో కుంభం తీవ్ర నిరాశకు గురయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ టికెట్ ఇస్తారని కేసీఆర్ హామీ ఇచ్చారని కుంభం అప్పట్లో విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

**బీసీలకు టికెట్ హుళక్కేనా!**

బీసీలకే టికెట్ అని సాగుతున్న నినాదం హుళక్కేనా అని ఒకవర్గం చర్చిస్తోంది. కర్ణాటక ఫార్ములా ప్రకారం లోక్‌సభ పరిధిలో రెండు సీట్లు బీసీలకు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయంగా ఉంది. అయితే భువనగిరి అసెంబ్లీ సీటు బీసీలకు అని ప్రచారం జరగడంతోపాటు కొందరు బీసీ నాయకులు టికెట్ల కోసం పైరవీలు సాగిస్తున్నారు. ఇప్పుడు కుంభం చేరికతో భువనగిరి టికెట్ ఆయనకే ఇవ్వాలని పార్టీ అధిష్ఠానానికి పీసీసీ ప్రతిపాదించే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకుడొకరు 'సాక్షి'తో చెప్పారు.

**కుంభం ఇంటికి భారీగా అనుచరులు**

కుంభం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాడన్న సమాచారంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటికి అనుచరులు భారీగా చేరుకున్నారు. కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితోపాటు వలిగొండ ఎంపీపీ నూతి రమేష్ రాజు, పచ్చాల జగన్, ఎల్లంల శాలిని జంగయ్యయాదవ్, ఏర్పుల శ్రీను, గడ్డమీది వీరస్వామిగౌడ్‌తో పాటుగా సుమారు 500 కార్యకర్తలు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**ఇంటికే పరిమితం కాలేక..**

డీసీసీ అధ్యక్షుడి హోదాలో బీఆర్‌ఎస్‌లో చేరిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆ పార్టీలో ఇమడలేకపోయారు. పదేళ్లుగా ప్రజల మధ్యన ఉన్న ఆయన బీఆర్‌ఎస్‌లో చేరి ఇంటికే పరిమితం అయ్యారు. దీనికితోడు ప్రొటోకాల్ ప్రకారం తనకు పదవి కావాలని పార్టీ అధినేతను కోరారు. ప్రస్తుత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి జోడెడ్లలా పనిచేయాలని, భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయని కేసీఆర్ ప్రటించిన విషయం తెలిసిందే. రెండు నెలలుగా ఇంటికే పరిమితమైన కుంభం కాంగ్రెస్‌లోని తన వర్గీయులను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారు.

**పార్టీ క్యాడర్ నుంచి వచ్చిన ఒత్తిడితోనే..**

డీసీసీ అధ్యక్షుడి హోదాలో కాంగ్రెస్‌ను వీడిన కుంభం తిరిగి పార్టీలో చేరాలని సొంత పార్టీలోని ఓ వర్గం ఆయనపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. మరో వైపు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జానారెడ్డి లాంటి సీనియర్లతో పాటు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం కుంభంను పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ సమావేశంలో సైతం కుంభం భువనగిరి నియోజకవర్గం అభ్యర్థిగా ఉండాలని సీనియర్లు ప్రతిపాదించారు. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని గెలిచే వారికి తప్పకుండా టికెట్ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే పార్టీని వీడి వెళ్లిన వారికి ఎలా అవకాశం ఇస్తారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి ప్రశ్నించినట్లు సమాచారం.

# అర్జీలు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌ఓ పద్మజారాణి

భువనగిరి టౌన్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం భువనగిరిలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి 21 ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖ 14, ఎంప్లాయ్‌మెంట్ 3, పంచాయతీ, విద్యా, మహిళా శిశు సంక్షేమ, చేనేత శాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయని అధికారులు తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, డీఆర్‌ఓ పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అభ్యంతరాలను పరిష్కరిస్తున్నాం..**

ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను వేగంగా పరిష్కరిస్తున్నామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.అమరేందర్, ఏసీపీ శివరాంరెడ్డి పాల్గొన్నారు.

## అర్హులకే పథకాలు ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

మోత్కూరు: ప్రభుత్వం ప్రకటించిన దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలను గ్రామసభల ద్వారా ఎంపిక చేసిన అర్హులకు ఇవ్వాలని మోత్కూరు మండలం పాలడుగులో సోమవారం వలిగొండ–తొర్రూరు రహదారిపై గ్రామ దళితులు, బీసీలు, పేదలు.. అఖిలపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అఖిలపక్షాల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ మరిపల్లి యాదయ్య, సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముక్కాముల వీరయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంతటి నర్సయ్య, ఉప సర్పంచ్ భగవంతు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రెయినేజీలు శుభ్రం చేయించండి

- దోమలు, పందులతో వేగలేకపోతున్నాం
- పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి
- 'సాక్షి ఫోన్‌ఇన్'లో భూదాన్ పోచంపల్లి వాసులు
- సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్న కమిషనర్ నర్సింహారెడ్డి

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో రెగ్యులర్‌గా ఫాగింగ్ జరగడం లేదు. దీంతో దోమల బెడద ఎక్కువ కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ ఓపెన్ డ్రెయినేజీలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చర్యలు చేపట్టాలని, పందులను దూరం ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యపై సోమవారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. పట్టణ వాసులు పలు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ప్రజలు విన్నవించిన సమస్యలు కమిషనర్ సమాధానం వారి మాటల్లోనే.. – భూదాన్‌పోచంపల్లి

ప్రశ్న : 10వ వార్డులోని గాంధీనగర్‌లో డ్రెయినేజీలను శుభ్రం చేయడంలేదు. ఫాగింగ్, బ్లీచింగ్ కూడా చేస్తలేరు. దుర్వాసన వస్తుంది. దోమలు విస్తరించి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.

– బానాల పూర్ణిమాచారి, షేక్ పర్వీన్, గాంధీనగర్



ఫోన్‌లో ప్రజా సమస్యలను వింటున్న మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి

కమిషనర్ : సిబ్బందిని పంపించి డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం. రెండు మూడు రోజుల్లో ఫాగింగ్ చేయించి బ్లీచింగ్ స్ప్రే చేయిస్తాం.

ప్రశ్న : మాధవనగర్ కాలనీలో పందుల బెడద ఎక్కువైంది. పందుల నివారణకు చర్యలు తీసుకోవాలి. – ఎం.పాండు, మాధవనగర్ కాలనీ

కమిషనర్ : పందుల పెంపకందారులకు నోటీసులు ఇస్తాం. వాటిని ఊరికి దూర ప్రాంతాలకు తరలించాలని వివరిస్తాం. ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున పందుల నివారణకు తగు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : ప్రగతినగర్, బస్వలింగేశ్వర కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న ఓపెన్ ప్లాట్‌లో కంపచెట్లు పెరిగి ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. వెంటనే తగు చర్యలు తీసుకోవాలి.

– వేముల శ్రీనివాస్, ప్రగతినగర్, కర్నాటి పురుషోత్తం, బస్వలింగేశ్వర కాలనీ

కమిషనర్ : మున్సిపల్ సిబ్బందిని పంపించి కంపచెట్లను తొలగిస్తాం. అలాగే ఇళ్లు, ఇంటి పరిసరాలను శుభ్రం ఉంచుకోవడం కూడా మనందరి బాధ్యత అని గుర్తుంచుకోవాలి.

ప్రశ్న : చెత్త ఆటోలు వస్తలేవు. రెగ్యులర్‌గా చెత్త ఆటోలు నడిపించేలా చర్యలు తీసుకోవాలి.

– చందు, ప్రకాశ్‌నగర్ కాలనీ

కమిషనర్ : వెంటనే చెత్త ఆటోలు వచ్చేలా తగు చర్యలు తీసుకొంటాం. అసరమైన వారికి తడి, పొడి చెత్త బుట్టలను అందజేస్తాం.

ప్రశ్న : ఇందిరానగర్ కాలనీలో చిన్నపాటి వర్షం వచ్చిన డ్రెయినేజీలు పొంగి మెయిన్ రోడ్డు మీదకు, ఇళ్లలోకి మురుగు చేరుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– చెరుకు నరేశ్, ఇందిరానగర్ కాలనీ

కమిషనర్ : డ్రెయినేజీ ఎగువన ఉండి, రోడ్డు దిగువకు ఉండడంతో రోడ్డు మీద నీరు నిలుస్తుందని గమనించాం. ఏఈని పంపించి అందుకు అవసరమైన చర్యలు తీసుకొంటాం. సమస్యను కౌన్సిల్ దృష్టికి కూడా తీసుకెళ్తాం.

ప్రశ్న : ఫిబ్రవరి నెల నుంచి ఫాగింగ్ చేయలేదు. పిల్లలకు జ్వరాలు వస్తున్నాయి. పారిశుద్ధ్యపై దృష్టి సారించాలి.

– కొండమడుగు భీమయ్య, ముక్తాపూర్, కొంక లక్ష్మీనారాయణ, వెంకటరమణ అంబేడ్కర్ విగ్రహం కాలనీ

కమిషనర్ : మున్సిపల్ పరిలోని ప్రతి వార్డులో ఫాగింగ్ చేయిస్తాం. బ్లీచింగ్ చేయించి మోరీల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తాం. స్థానిక కౌన్సిలర్, వార్డు అధికారి, శానిటేషన్ ఇన్‌చార్జ్‌తో కలిసి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షిస్తాం.

ప్రశ్న : 3వ వార్డులో ఇటీవల డ్రెయినేజీలు, సీసీ రోడ్లు వేసి ఇరువైపులా మట్టిని పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

–రావుల అనిల్, రేవనపల్లి

కమిషనర్ : వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం. అలాగే సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టిని పూడ్పించుటకు కూడా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద వాటర్ పైప్‌లైన్ లీకై నీరంతా వృథాగా పోతుంది. ఆ నీరు మెయిన్ రోడ్డుపైకి వస్తుండటంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– గుండు నవీన్, 9వ వార్డు

కమిషనర్ : సమస్య మీ ద్వారానే మా దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత సిబ్బందిని పంపిస్తాం. వాటర్ లీకేజీని అరికడతాం.

## 'ఇక్కత్' తళుకులు



మిసెస్ ఇండియా తెలంగాణ మమత త్రివేది ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో జరిగిన మిస్సెస్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీల్లో పలువురు మోడల్స్ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేసి అతిథులు, ప్రేక్షకులను అలరించారు.

- వివరాలు 8లో

## క్లుప్తంగా

### చెట్టును ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

**మునగాల(కోదాడ):** బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం మునగాల మండలంలోని ఇందిరానగర్ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. స్థానిక ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం దోరకుంట గ్రామానికి చెందిన వేమ వెంకటేశ్వర్లు(35) సోమవారం తన బైక్‌పై చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో మునగాల మండలంలోని ఇందిరానగర్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆటో బోల్తా.. 10 మంది మహిళలకు గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో ఇదే..

**భూదాన్‌పోచంపల్లి:** ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 10 మంది మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం పోచంపల్లి మండల శివారులోని కొత్తగూడెం సమీపంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖి గ్రామానికి చెందిన స్వయం సహాయక మహిళా సంఘానికి చెందిన 12 మంది మహిళలు పోచంపల్లిలోని ఏపీజీవీ బ్యాంకులో పని నిమిత్తం గ్రామానికి చెందిన ఆటోలో బయల్దేరారు. కాగా కొత్తగూడెం దాటాక ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఆటో డ్రైవర్ తప్పించేందుకు ప్రయత్నించగా.. ఆటో రోడ్డు కిందకి దిగి బోల్తా పడింది. దీంతో ప్రయాణిస్తున్న డ్రైవర్ యాదయ్యతో పాటు 10 మంది మహిళలకు గాయాలయ్యాయి. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు గమనించి క్షతగాత్రులను అంబులెన్స్‌లో రంగారెడ్డి జిల్లా పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. గాయపడిన వారిలో జిట్టమోని సంతోష, నడికుడి శిరీష, దుర్గం మమతతో పాటు ఆటో డ్రైవర్ దుర్గం యాదయ్య తల, కాలు, చేతులు, నడుం విరగడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద, సాయిసంజీవని ఆస్పత్రులకు తరలించారు.

### మట్టపల్లిలో నిత్య కల్యాణం

**మఠంపల్లి:** మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, నిత్యహోమం, శ్రీమూలవిరాట్ మూర్తికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు, కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పూర్యతండా శివారులో దారుణ హత్య

- బొగ్గు బట్టీలకు కావలాగా పడుకున్న వ్యక్తిని గొంతునులిమి చంపిన దుండగులు
- భార్య, కుమారుడు పక్కనే నిద్రిస్తుండగానే ఘాతుకం
- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ఇల్లాలే హత్య చేయించిందని ఆరోపణ
- పోలీసుల అదుపులో హతుడి భార్య?


డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు


చాంప్ల (ఫైల్)


చాంప్ల మృతదేహం

**అర్వపల్లి:** బొగ్గు బట్టీల వద్ద కాపలాగా భార్య, కుమారుడితో కలసి నిద్రిస్తున్న వ్యక్తిని దుండగులు దారుణంగా హత్య చేశారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యతండా సమీపంలో గుట్టల వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నూతనకల్ మండలం బక్కహేమ్లాతండాకు చెందిన గుగులోతు చాంప్ల(38) తండాలో వ్యవసాయంతోపాటు జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యతండా సమీపంలో గుట్టల వద్ద బొగ్గు బట్టీలు పెడుతూ జీవనం సాగిస్తున్నాడు.

**ప్రేమించి పెళ్లి చేసుకొని..**

బక్కహేమ్లాతండాకు చెందిన గుగులోతు చాంప్ల 12ఏళ్ల కిందట అదే తండాకు చెందిన క్లాస్‌మేట్ అరుణను ప్రేమించాడు. పెద్దలు అంగీకరించకపోయినా వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఇరు కుటుంబాల పెద్దలకు నచ్చజెప్పి సంసారం సాఫీగా చేస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమార్తెలు ఝాన్సీ, రోహిత, కుమారుడు ధనుష్ ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు నకిరేకల్‌లోని గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కుమారుడు తల్లిదండ్రులతో పాటే ఉంటున్నాడు.

**గొంతు నులిమి.. కాలు, చేయి విరగ్గొటి..**

చాంప్ల ఆదివారం రాత్రి భార్య, కుమారుడితో కలసి ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం బక్కహేమ్లాతండా నుంచి పూర్యతండాలోని బొగ్గుబట్టీల వద్దకు వచ్చాడు. కాపలాగా భార్యాకుమారుడు ఒక మంచంలో, చాంప్ల మరో మంచంలో నిద్రించారు. సోమవారం ఉదయం వరకు అందరూ నిద్రపోయి ఉండగా సమీపంలోని తండాకు చెందిన వారు వచ్చి వారిని లేపే క్రమంలో చాంప్ల విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో వారు కేకలు వేస్తూ తండా గిరిజనులకు సమాచారం ఇచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు అక్కడికి వచ్చి మంచంలో నిద్రిస్తున్న చాంప్లపై దాడి చేయడంతో కాలు, చేయి విరిగిపోయిన ఆనవాళ్లు ఉన్నాయి. అనంతరం అతడి గొంతు నులిమి హత్య చేసినట్లు తెలుస్తోంది. అరుణ బోరున విలపిస్తూ తన భర్తని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపి పోయారని పేర్కొంటోంది.

**వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..**

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడన్న కారణంతోనే కోడలు అరుణ తన ప్రియుడు, మరికొందరి సహకారంతో కుమారుడిని హత్య చేయించిందని చాంప్ల తల్లి గుగులోతు జక్కి ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని నాగారం సీఐ శివశంకర్, స్థానిక ఎస్‌ఐ బి.ఆంజిరెడ్డి పరిశీలించారు. సూర్యాపేట నుంచి డాగ్‌స్క్వాడ్‌ను తీసుకువచ్చి ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు.

**అమ్మా.. నాన్నను చంపుతున్నారు**


మృతుడి కుమారుడు ధనుష్

అమ్మా.. నాన్నను చంపుతున్నారు.. అంటూ ఏడ్చినా తల్లి పట్టించుకోకుండా నువ్వు పడుకో అని చెప్పిందని హతుడు చాంప్ల ఏడేళ్ల కుమారుడు ధనుష్ గిరిజనుల వద్ద వీడియోలో చెప్పిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చాంప్ల హత్యతో బక్కహేమ్లాతండా, పూర్యతండాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. బక్కహేమ్లాతండాకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో సంఘటనాస్థలికి తరలివచ్చారు. తండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయని నాగారం సీఐ శివశంకర్ తెలిపారు. హతుడి తల్లి ఫిర్యాదుతో పాటు ఏడేళ్ల కుమారుడు ధనుష్ వీడియో ఆధారంగా పోలీసులు అరుణను అనుమానిస్తూ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

# అలరించిన ఇక్కత్ ఫ్యాషన్ షో


ఇక్కత్ చీరలు ధరించి మిస్సెస్ తెలంగాణ, ఏపీ ఫైనలిస్టులతో ర్యాంప్ వాక్ చేస్తున్న మమత త్రివేది


చేనేత వస్త్రంపై రూపొందించిన జీ-20 సమావేశాల లోగో ఆవిష్కరిస్తున్న మమత త్రివేది

**భూదాన్‌పోచంపల్లి:** హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో ఆదివారం రాత్రి మిస్సెస్ ఏషియా ఇంటర్నేషన్ వరల్డ్–2017 విన్నర్, మిస్సెస్ ఇండియా తెలంగాణ మమత త్రివేది ఆధ్వర్యంలో మిస్సెస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కిరీటం కోసం జరిగిన ఫైనల్ పోటీల్లో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు తళుక్కుమన్నాయి. 35 మంది ఫైనలిస్టులు పోచంపల్లి ఇక్కత్ చీరలు, వస్త్రాలు ధరించి ఫ్యాషన్ షో నిర్వహించారు. మూడు రౌండ్‌లలో జరిగిన ఈ పోటీల్లో సంప్రదాయ రౌండ్‌లో పోచంపల్లి ఇక్కత్ చీరలు ధరించి నిర్వహించిన ర్యాంప్ వాక్ అక్కడ ఉన్న అతిథులు, ప్రేక్షకులను అలరించాయి. ఫైనల్‌లో పోటీ పడ్డ 35 మంది మోడల్స్‌కు పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మిసెస్ ఇండియా తెలంగాణ మమత త్రివేది మాట్లాడుతూ.. తాను పోచంపల్లిని పలుమార్లు సందర్శించి అక్కడి చేనేత కళాకారుల నైపుణ్యాలను, వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. కానీ చేనేత కళాకారుల కష్టానికి తగ్గ ఫలితం, గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే అంతర్జాతీయ వేదికల్లో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు మరింత ప్రాచుర్యంతో పాటు కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకే మిస్సెస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఫైనల్ పోటీల్లో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ధరించి ఫ్యాషన్ షో నిర్వహించామని వివరించారు. అనంతరం పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తడక రమేశ్, భారత లవకుమార్ మాట్లాడుతూ.. యువత అభిరుచులకు అనుగుణంగా, మారుతున్న కాలానుగుణంగా ఆధునిక డిజైన్‌ల రూపకల్పనలో పోచంపల్లి చేనేత కళాకారులకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. అలాగే ప్రింటెడ్ చేనేత వస్త్రాలను అరికట్టాలని, వాటిని ప్రోత్సహించవద్దని కోరారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రంపై రూపొందించిన జీ20 లోగో ఆవిష్కరించి మమత త్రివేదికి బహూకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భోగ విష్ణు, కోశాధికారి ముస్కూరి నర్సింహ, సభ్యులు సీత లక్ష్మణ్, గంజి బాలరాజు, సీత భవానీ, గుండు ఉప్పలయ్య, తాటి గిరిబాబు పాల్గొన్నారు.

## మఠంపల్లి ఎస్‌ఐకి రూ.5వేలు జరిమానా



మఠంపల్లి ఎస్‌ఐ జరిమానా చెల్లించిన రశీదు

**మఠంపల్లి:** కోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను మఠంపల్లి స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఉన్న ఎస్‌ఐ బాలకృష్ణకు రూ.5వేలు జరిమానా విధిస్తూ హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డి తీర్పు వెలువరించారు. ఈ మేరకు ఎస్‌ఐ సోమవారం రాష్ట్ర న్యాయ సేవా సంస్థకు రూ.5వేలు జరిమానా చెల్లించి రశీదు పొందారు. వివరాలు.. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన వల్లపుదాసు కలమ్మకు భూమిని ఆమె ఆడపడుచు యరగాని విజయలక్ష్మి, ఆమె భర్త గురువయ్య ఫోర్జరీ సంతకాలతో మ్యూటేషన్ చేయించుకుని పట్టాదారు పాసుపుస్తకం పొందారు. ఈ విషయం తెలుసుకున్న కళమ్మ మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సూర్యాపేట ఎస్పీ, కోదాడ డీఎస్పీ, హుజూర్‌నగర్ సీఐకి రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఆమె హుజూర్‌నగర్ కోర్టును ఆశ్రయించింది. దీంతో న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు ద్వారా కళమ్మ ప్రైవేట్ కంప్లైంట్ దాఖలు చేయగా న్యాయమూర్తి ఆ కంప్లైంట్‌ను మఠంపల్లి పోలీస్ స్టేషన్‌కు పంపి కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎస్‌ఐ కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకపోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై పూర్తి వాదనలు విన్న న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డి మఠంపల్లి ఎస్‌ఐ బాలకృష్ణను రాష్ట్ర న్యాయసేవా సంస్థకు రూ.5వేలు జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించారు. ఈ మేరకు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ పేరుతో ఎస్‌ఐ బాలకృష్ణ జరిమానా రూ.5వేలు చెల్లించి రశీదు పొందారు. కాగా గత నెలలోనే ఇక్కడ పనిచేసిన మరో ఎస్‌ఐకి హైకోర్టు రూ.2వేలు జరిమానా విధించిన విషయం తెలిసిందే.

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త లవకుమార్

**కోదాడరూరల్:** సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు లవకుమార్, కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం కోదాడ మండలంలోని రెడ్లకుంట వెంకటేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జీవసంబంధిత ఎరువులతో సేంద్రియ వ్యవసాయంలో విజయం సాధించవచ్చని అన్నారు. రసాయన ఎరువులను ఇబ్బడిముబ్బడిగా వాడటం ద్వారా నిస్సారమైన నేల మాత్రమే మిగులుతుందని సూచించారు. ఒకసారి నేలను సేంద్రియ సాగుకు అలవాటు చేస్తే రైతులకు నాణ్యమైన అందుతాయని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని అన్నారు. అదేవిధంగా గొర్రెలు, మేకలు, కోళ్లు, చేపల పెంపకంపై అవగాహన కల్పించడంతో పాటు పలు రకాల మిశ్రమాలు, కషాయాల తయారీని రైతులకు వివరించారు. వెంకటేశ్వర్‌రావు వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ మేనేజర్ ప్రసాద్, రైతులు వెంకటేశ్వరరావు, శేషుకుమార్, ఓ. శ్రీనివాసరెడ్డి, ఎరగాని లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోతిలో ఉన్నది పెంపుడు కుక్క

- పానగల్ రిజర్వాయర్ ఎగువన పూడ్చిన గోతిని తవ్విన పోలీసులు

**నల్లగొండ క్రైం:** నల్లగొండ మండలం చందనపల్లి గ్రామ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో ఆదివారం కొందరు వ్యక్తులు రహస్యంగా గోతిని తవ్వి పూడ్చి పెట్టినట్లు సమాచారం అందడంతో సోమవారం నల్లగొండ రూరల్ పోలీసులు ఆ గోతిని తవ్వి చూడగా.. అందులో పెంపుడు కుక్క కళేబరాన్ని గుర్తించారు. నల్లగొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తమ పెంపుడు కుక్క అనారోగ్యంతో మృతిచెందగా.. ఇంట్లో చిన్నారులు కుక్క కోసం రోదిస్తారని భావించి వారు నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి కుక్కను కారులో తీసుకొచ్చి రహస్యంగా పూడ్చి పెట్టారని, దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఐ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. గోతిలో నుంచి బయటకు తీసిన కుక్క కళేబరాన్ని తిరిగి ఆ గోతిలోనే పూడ్చివేసినట్లు పేర్కొన్నారు.

## వారం రోజుల్లో సాగర్ ఎడమ కాలువకు నీరు


సమావేశంలో పాల్గొన్న ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

**కోదాడ:** వారం రోజుల్లో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు ప్రభుత్వం సాగునీటిని విడుదల చేస్తుందని, పంటల సాగుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత తొమ్మిది సంవత్సరాలుగా కనిపించని నాయకులు ఎన్నికలు దగ్గరకు రావడంతో సాగర్ నీటి విడుదల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం జలాలను కోదాడ నియోజకవర్గానికి తీసుకొచ్చిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 స్థానాలను బీఆర్‌ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహిళా బిల్లు ఆమోదంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓటు వేయలేదని, బీఆర్‌ఎస్ ఎంపీలు చిత్తశుద్ధితో వ్యవహరించి మహిళా బిల్లుకు ఆమోదింపజేశామని అన్నారు. సాగునీటి విషయంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇష్టానురీతిగా మాట్లాడటం సరికాదని, గత 9 సంవత్సరాలుగా రెండు పంటలకు నీరు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చందు నాగేశ్వరరావు, సుంకర అజయ్‌కుమార్, ఈదుల కృష్ణయ్య, ఇమ్రాన్ ఖాన్, రషీద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లు ఇవ్వలేని నాయకులకు ఓట్లడిగే అర్హత లేదు

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


బజ్జూరి వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి

**చిలుకూరు:** సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు విడుదల చేయకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని, పంటల సాగుకు నీళ్లివ్వలేని వారికి వచ్చే ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం చిలుకూరు మండలంలోని బేతవోలులో మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టులోని నీరు డెడ్ స్టోరేజీలో ఉన్నా ఆయకట్టు రైతులకు ప్రణాళిక ప్రకారం నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకున్నామని అన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా ఎమ్మెల్యేలు ల్యాండ్, శ్యాండ్, మైన్స్, వైన్స్ దందాలో ఉన్నారని విమర్శించారు. దళితబంధు పథకంలో లబ్ధిదారులకు కంటే ఎక్కువ మొత్తంలో 70శాతం కమీషన్లు మధ్యవర్తులకే పోతున్నాయని అన్నారు. తనతో పాటు కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి నిజాయితీగా ప్రజాసేవ చేశామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ 70 స్థానాలు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తామన్నారు. దేశంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి పద్మావతి 50వేల మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బజ్జూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి మండల వ్యాప్తంగా 300 మందికి పైగా కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి, పార్టీ రాష్ట్ర నాయకుడు చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పింద్రాతి హనుమంతరావు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచుల, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## భర్త ఇంటి ఎదుట బైఠాయించిన భార్య

- కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు


శృతికి కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

**నార్కట్‌పల్లి:** భర్త ఇంటి ఎదుట భార్య బైఠాయించిన ఘటన నార్కట్‌పల్లి మండలంలోని కొండపాకగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన శృతికి నార్కట్‌పల్లి మండలం కొండపాకగూడెం గ్రామానికి చెందిన జీడిమడ్ల రవీందర్‌రెడ్డితో 2022 ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వివాహ సమయంలో శృతి కుటుంబ సభ్యులు ముందుగా అనుకున్న ప్రకారం కట్నకానుకలు ఇచ్చారు. వివాహమైన కొన్ని నెలల వరకు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. కాగా 5 నెలల క్రితం తన భర్త అదనపు కట్నం కావాలని వేధిస్తున్నాడంటూ శృతి తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీనిపై నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు కొనసాగుతోంది. కాగా సోమవారం మహిళా పోలీస్ స్టేషన్‌లో పంచాయితీ ఉండగా రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులందరూ అక్కడకు వెళ్లారు. కానీ శృతి నేరుగా కొండపాకగూడెంలోని భర్త ఇంటి వద్దకు వచ్చి తన భర్త తనకు కావాలంటూ అతడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఈ విషయం తెలుసుకున్న నార్కట్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శృతికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**చౌటుప్పల్:** మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో బొర్రోళ్లగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా.. అతడు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాతున్నాడు. సోమవారం చౌటుప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న సుమారు 40 నుంచి 45 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి బొర్రోళ్లగూడెం స్టేజీ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. ప్రస్తుతం అతడు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో వివరాలు గుర్తించడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. అతడి ఆచూకీ కోసం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో లేదా 8712662481 నంబర్‌కు సంప్రదించాలని సీఐ ఎస్. దేవేందర్ తెలిపారు.

## యాదాద్రిలో సురక్ష సిబ్బందిపై భక్తుల దాడి


సురక్ష సిబ్బందిపై దాడి చేస్తున్న భక్తులు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు కొందరు కొండ పైన విధులు నిర్వహిస్తున్న సురక్ష సిబ్బందిపై సోమవారం దాడి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన బి. క్రాంతి సురక్ష సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా హైదరాబాద్‌కు చెందిన భక్తులు పలువురు పుష్కరిణి చెంత ఉన్న మహిళా భక్తులు కొందరు మరుగుదొడ్ల వైపు వెళ్తుండగా.. మరో చోటు నుంచి వెళ్లాలని క్రాంతి వారికి సూచించాడు. దీంతో అతడితో మహిళా భక్తులు వాగ్వాదానికి దిగి దాడి చేశారు. అక్కడికి చేరుకున్న క్రాంతి స్నేహితులు భక్తులతో వాగ్వాదానికి దిగారు. వెంటనే అక్కడ ఉన్న ఆలయాధికారులు పలువురు జోక్యం చేసుకొని వారిని పంపించారు. క్రాంతి తలకు బలమైన గాయం కావడంతో కుట్లు పడినట్లు స్నేహితులు తెలిపారు. తమ సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ భాస్కర్‌రావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్‌రావు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** సమాజంలోని అన్నివర్గాలకు విద్య అందినప్పుడే విజ్ఞానవంతమైన సమాజం ఏర్పడుతుందని, అందుకే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్‌రావు అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు పోలబోయిన కిరణ్ అధ్యక్షతన సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో కేసీఆర్ 9ఏళ్ల పాలనలో విద్యారంగ పరిస్థితులు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి పాలకులు బడుగు, బలహీన వర్గాలకు విద్య అందనివ్వకుండా ప్రైవేట్, కార్పొరేట్ వశం చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు చదువుకునే 9వేల ప్రభుత్వ పాఠశాలలు మూతబడ్డాయని అన్నారు. జూనియర్ కాలేజీలు సమస్యలతో సతమతమవుతున్నాయని, కనీసం టాయిలెట్స్ నిర్మించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా, కాకతీయ, జేఎన్టీయూ, శాతవాహన యూనివర్సిటీలకు నిధులు కరువయ్యాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చి ఉన్నత విద్యను పేద విద్యార్థులకు దూరం చేసిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు కృషిచేయాలని అన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో విద్యారంగానికి 18శాతం నిధులు కేటాయిస్తే కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కేవలం బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించడం దారుణమన్నారు. తెలంగాణ ప్రభుత్వ నిరుద్యోగులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం. చందర్‌రావు, జిల్లా నాయకుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, రహీం, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

**భూదాన్‌పోచంపల్లి:** మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 2నెలల కాల వ్యవధి కల్గిన సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సుకు ఇంటర్ విద్యార్హత, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీ యన్ కోర్సుకు పదో తరగతి, ఆటోమొబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులని అన్నారు. అదేవిధంగా అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు వెంట తీసుకొని అక్టోబర్ 3న ఉదయం 10గంటల నుంచి సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు నెలకు రూ.3వేల ఫీజుతో హాస్టల్ వసతి కూడా కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగం కూడా కల్పించబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 913308000, 9133908111, 9133908222 నంబర్లను సంప్రదించాలని సూచించారు.